ఈనాడు పల్నాడు

శనివారం అక్టోబరు 12, 2024

ఉచిత వినికిడి పరికరాలకు దరఖాస్తులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో వినికిడి లోపం ఉన్నవారికి పరికరాలు అందించేందుకు దరఖాస్తులు 14న స్వీకరిస్తామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి పేర్కొన్నారు. పల్నాడు రోడ్డులోని ప్రభుత్వ వైద్యశాలలో జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో దరఖాస్తులు తీసుకుంటామన్నారు. నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ డెఫ్నెస్ కార్యక్రమంలో భాగంగా వినికిడి లోపం పరీక్షలు, పరికరాల అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.



దసరా సందర్భంగా శుక్రవారం వినుకొండ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి నగరోత్సవంలో భాగంగా కలశాలను తీసుకొస్తున్న మహిళలు, సత్తెనపల్లి పట్టణంలో అమ్మవారికి అలంకరణ

- న్యూస్‌టుడే, వినుకొండ, సత్తెనపల్లి

మద్యం దరఖాస్తుదారులకు అభయం

ఎవరైనా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవచ్చన్న ప్రజాప్రతినిధులు

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ

ఈనాడు-నరసరావుపేట

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీని రూపొందించి ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానించిన సంగతి తెలిసిందే. పలు రాష్ట్రాల్లో పరిశీలన అనంతరం కూటమి ప్రభుత్వం మెరుగైన పాలసీని తీసుకొచ్చింది. దీంతో విదేశాల్లో ఉండే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు మొదలుకుని రాష్ట్రంలో పని చేసే పలు వృత్తి విద్య నిపుణులు తొలిసారిగా ఈ రంగంలోకి వచ్చేందుకు ఆసక్తి కనబరిచారు. దరఖాస్తుల స్వీకరణ అంతా ఆన్‌లైన్‌లోనే చేసుకునేలా చర్యలు తీసుకుంది. దీంతో ఎవరు, ఎక్కడి నుంచి దరఖాస్తు చేశారు.. వారెవరో కూడా లాటరీ తీసే వరకు అధికారులకు తెలియదు. తెలంగాణ రాష్ట్రం నుంచి చాలా మంది వచ్చి దరఖాస్తులు చేయడం కనిపించిందని అధికారవర్గాలు తెలిపాయి. వారు చాలా వరకు సర్కిల్ కార్యాలయాలకు వచ్చి మాన్యువల్‌గా దరఖాస్తులిచ్చారని అందువల్లే వారిని గుర్తు పట్టగలిగామని చెప్పారు.



పల్నాడు జిల్లాలో మాచర్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల సమయానికి దరఖాస్తులు కొన్ని షాపులకు నాలుగైదుకు మించిరాలేదని తెలుసుకుని ఆ ప్రాంత ఎక్సైజు ఇన్‌స్పెక్టర్లతోనూ ఉన్నతాధికారులు మాట్లాడి కారణాలు తెలుసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి, కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు దరఖాస్తులపై జిల్లా డీసీలు, ఈఎస్‌లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలో కొన్ని షాపులకు 90కు పైగా దరఖాస్తులు అందాయి. అదేవిధంగా గురజాల, వినుకొండ నియోజకవర్గాల్లో బాగా దరఖాస్తులు రాగా, పెదకూరపాడు, నరసరావుపేట నియోజకవర్గాల్లో ఓ మోస్తరుగా అందాయి. చాలాచోట్ల మద్యం వ్యాపారులకు బెదిరింపులు రావడంతో దరఖాస్తు చేసేందుకు వెనకడుగేశారు. దీంతో ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు. మద్యం వ్యాపారానికి అడ్డంకులు ఎవరూ సృష్టించినా తాము ఊరుకోబోమని అభయం ఇవ్వడంతో చివరి రోజు దరఖాస్తు చేసేందుకు ముందుకొచ్చారు. శుకవారం రాత్రి వరకు జిల్లాలో 2621 దరఖాస్తులు వచ్చాయని ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

లక్ష్యానికి చేరువగా.. మద్యం దుకాణాల కోసం జిల్లా వాసులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యేకించి తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారు గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని పలు షాపుల కోసం దరఖాస్తులు చేయడం గమనార్హం. ఈనెల ఒకటిన ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం రాత్రి 7 గంటలతో ముగిసింది. అయితే ఆ వ్యవధిలోపు ఆన్‌లైన్లో లాగిన్ అయిన అర్ధరాత్రి 12 గంటల్లోపు దరఖాస్తు అందించేలా అవకాశం కల్పించింది. శుక్రవారం సాయంత్రం వరకు మూడు జిల్లాల పరిధిలో కలిపి 7 వేలపైచిలుకు దరఖాస్తులు అందాయి. వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి. దరఖాస్తులు పెరిగేలా యంత్రాంగం తీసుకున్న చొరవ, ప్రణాళిక కొంతమేరకు ఫలించింది.

15, 16 తేదీల్లో రెండో దశ వెబ్ ఆప్షన్లు

గుంటూరు, న్యూస్‌టుడే: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హానర్స్), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సుల్లో 2024-25 ఏడాదిలో మిగిలిన సీట్లకు ప్రవేశాలకు రెండో దశ ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్లు ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు angrau.ac.in ని చూడాలని సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు: డీఎస్సీ ఉచిత శిక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుంచి 21వ తేదీ లోపు https://jnanabhumi.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న ఎంపిక చేసిన కేంద్రంలో ప్రాథమిక పరీక్ష నిర్వహించి 85 శాతం మార్కులు, టెట్‌లో 15 మార్కులు వెయిటేజ్ ఇస్తారన్నారు. ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 22వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

రెండోరోజు కొనసాగిన సీఐడీ విచారణ

- ఐసీఐసీఐ బ్యాంకులో బాధిత ఖాతాదారుల విచారణ
- నష్టపోకుండా చర్యలుంటాయని అధికారుల వెల్లడి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ విచారణ రెండోరోజు శుక్రవారం కొనసాగింది. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంకుల్లో గతంలో పనిచేసిన బ్యాంకు మేనేజర్ నరేష్ మోసాలపై సీఐడీ అదనపు ఎస్పీ ఆదినారాయణ, సీఐ సంజీవకుమార్‌ల ఆధ్వర్యంలో బృందం బాధితుల విచారించింది. ఎలా నగదు ఇచ్చారు... ఫిక్స్‌డ్ డిపాజిట్లు తీసుకున్న సమాచారం.. వాటిపై ఓడీలు తీసుకోవడం.. బంగారం పెట్టి రుణాలు పొందడం.. ఇలా ఎన్ని రకాలుగా నరేష్ తమను మోసం చేశాడో విచారణకు హాజరైన 25 మంది ఖాతాదారులు సీఐడీ అధికారులకు వివరించారు. విచారణ అనంతరం సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ మీడియాతో మాట్లాడుతూ సీఐడీ దర్యాప్తు కొనసాగుతోందని, శనివారం, ఆదివారం సెలవు దినాలు అయినా గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఇప్పటికే బ్యాంకు జడ్.ఎం. ఫిర్యాదు మేరకు 72 మంది ఖాతాదారుల నుంచి రూ.28 కోట్ల మోసంపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాధితుల నుంచి నరేష్ మోసపూరితంగా మళ్లించిన నగదు ఏం చేశాడు.. ఎవరి ఖాతాకు పంపాడు.. ఇలా అన్ని ఇలా ప్రతి అంశాన్ని దర్యాప్తు చేస్తున్నామన్నారు. సెలవుల అనంతరం తిరిగి సోమవారం నుంచి విచారణ కొనసాగుతుందని చెప్పారు.



చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ విచారణకు హాజరైన బాధితులు

మద్యం దుకాణాల దరఖాస్తుల పరిశీలన

క్రోసూరు(అచ్చంపేట), పెదకూరపాడు, న్యూస్‌టుడే: క్రోసూరు, పెదకూరపాడు ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను శుక్రవారం మధ్యాహ్నం అబ్కారీశాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు పరిశీలించారు. దరఖాస్తులు అందజేసిన వారితో మాట్లాడారు. ఏసీలు సుధాకర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, ఏఈఎస్ సూర్యనారాయణ, సీఐ రేఖ, తులసి పాల్గొన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఆత్మహత్య చేసుకుంటా

- నేనొక్కడినే తప్పు చేయలేదు
- ఐసీఐసీఐ బ్యాంక్ కేసు నిందితుడు నరేష్


సెల్ఫీ వీడియోలో నరేష్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతీనగర్ ఐసీఐసీఐ బ్యాంకుల్లో జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ జరుగుతున్న నేపథ్యంలో తాను మోసపోయానంటూ ఐసీఐసీఐ గత మేనేజర్ నరేష్ సెల్ఫీ వీడియో విడుదల చేయడం కలకలం రేపుతోంది. బ్యాంకు ఆర్థిక లావాదేవీలు పెంచే క్రమంలో కొన్ని తప్పులు జరిగాయని... ఉన్నతాధికారులు... బ్యాంకు సిబ్బంది అంతా తననే తప్పు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాతాదారులను మోసం చేసే ఉద్దేశం లేదని వివరణ ఇచ్చిన నరేష్... బంగారం రుణాలకు సంబంధించి కొంతమంది పేర్లు మార్చామని.. మోసం చేయలేదని వీడియోలో వెల్లడించారు. ఖాతాదారులకు ప్రతినెలా వడ్డీ సక్రమంగా చెల్లిస్తూనే ఉన్నానని, ఈ క్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. విజయవాడ భారతీనగర్ బ్రాంచికి వెళ్లిన తర్వాత రెండు, మూడు నెలల నుంచి జడ్.ఎం. సందీప్ మెహ్రా వల్ల ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. నరసరావుపేటలోని కరుణాకర్, చిలకలూరిపేటలోని హరీష్‌కు అంతా తెలుసునన్నారు. కానీ నన్ను మాత్రం దోషిగా నిలబెడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. అధికారుల ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని భార్య జోషి, పిల్లలను చూసి ఆలోచన విరమించుకున్నట్లు పేర్కొన్నారు. రావాల్సిన డబ్బు వస్తే సర్దుబాటు చేసి తప్పుకోవాలనుకున్నానని, కానీ తనను మోసం చేశారని వాపోయారు. అందరూ డబ్బు తీసుకున్నారని, కానీ నన్ను మాత్రమే తప్పుపడుతున్నారన్న నరేష్.. ఇక తనకు బతకాలని లేదని, చనిపోదామనుకుంటున్నానని వీడియోలో చెప్పాడు.

పలువురి పేర్లు వెల్లడింపు

ఇంకా వీడియోలో విజయవాడ భారతీనగర్ బ్రాంచిలో ఆర్.ఎస్.చంద్రశేఖర్, ఏలూరు రోడ్డు ప్రవీణ్ డబ్బులు తీసుకున్నారని, వంశీ నరసరావుపేటలోని తన ఇంట్లోనే ఉంటున్నట్లు తెలిపారు. ప్రతి లావాదేవీ బ్యాంకు నుంచి జరిగినట్లు తెలిపారు. సింగ్ ఖాతాకు కూడా డబ్బులు వెళ్లాయన్నారు. తనకు జంగారెడ్డిలో కంచర్ల విష్ణు ప్రసాద్, పులిపాక ఉమామహేశ్వరరావు రూ. 5 నుంచి 6 కోట్లు ఇవ్వాల న్నారు. సీఎస్ఆర్, టీపీఎఫ్ లావాదేవీలు పూర్తయితే ప్రభుశేఖర్, కిరణ్ అన్ని క్లియర్ చేస్తారని వీడియోలో పేర్కొన్నారు.

వైకాపా దాష్టీకాలపై పోరాడిన తెదేపా కుటుంబానికి లోకేశ్ అండ

ఈనాడు, అమరావతి: గత ఐదేళ్లు వైకాపా దాష్టీకాలపై పోరాడిన పిడుగురాళ్ల మండలం కోనంకి తాండాకు చెందిన బాణావత్ లక్ష్మీదేవి భాయ్, వెంకటేశ్వర్లు నాయక్‌లకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. వారిని శుక్రవారం ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని ఆర్థికసాయం అందించి భరోసానిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లను వైకాపా నేతలు వేధింపులకు గురిచేసినా.. ఎక్కడా తొణకకుండా వీరి పన్నెండేళ్ల కుమారుడు తమ ఇంటిపై తెదేపా జెండా ఎగురవేశారు. దీన్ని ఓర్చుకోలేని జగన్ సైన్యం ఆ పిల్లాడి నోట్లో పురుగుమందు పోసి చంపేయాలని చూసింది. కుమారుడికి వైద్యం చేయించి తల్లిదండ్రులు దక్కించుకున్నారు. ఘటనపై కేసు పెట్టినా పోలీసులు పట్టించుకోలేదు. తన కుమారుడు ఇంటిపై తెదేపా జెండాను కట్టిన చోటే మళ్లీ ఆ తల్లి పార్టీ జెండాను ఎగురవేశారు. దీంతో వైకాపా కార్యకర్తలు మళ్లీ వారిపై దాడులకు తెగబడ్డారు. ఆ కుటుంబం ఇటీవల తెదేపా జాతీయ కార్యాలయానికి వచ్చి తమ దుస్థితిని వివరించారు. విషయం తెలుసుకున్న లోకేశ్ వారిని పిలిపించుకుని మాట్లాడి భరోసానిచ్చారు.


బాణావత్ లక్ష్మీదేవి భాయ్, వెంకటేశ్వర్లు నాయక్‌లతో మంత్రి లోకేశ్

పండగ వేళ పేక ముక్కల జోరు

- ✶ క్లబ్‌లు మూసివేసినా రహస్యంగా శిబిరాలు
- ✶ ప్రజాప్రతినిధుల బంధువులే సూత్రధారులు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

జిల్లాలో ముఖ్యంగా నరసరావుపేట మండల పరిధిలో ఇటీవల వరుసగా జూద శిబిరాలపై దాడులు జరుగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అయినా సరే ఎక్కడోచోట నాయకులు రహస్య ప్రదేశాల్లో ఆడిస్తున్నారు. కీలక వ్యక్తులను వదిలేస్తుండడం వల్లే ఒకచోట కాకపోయినా మరోచోట ఇలా శిబిరాలను మారుస్తూ జూదం ఆడిస్తూ రూ.లక్షలు చేతులు మారుస్తున్నారని తెలుస్తోంది. జిల్లాలో ముఖ్యమైన కేంద్రానికి ప్రజాప్రతినిధి అయిన ఆయన బంధువు ఈ అసాంఘిక కార్యకలాపాలకు ముఖ్యపాత్ర పోషిస్తున్నాడని నియోజకవర్గంలో అందరికీ తెలిసిందే. అతని ఆధ్వర్యంలోనే ఆ మధ్య ఏకంగా కొబ్బరికాయ కొట్టి మరీ కోడి పందేలు, జూద శిబిరాలు ప్రారంభించారు. అంతేకాకుండా ఎవరైనా జూదంలో పట్టుపడితే ఆయా స్టేషన్‌లకు వెళ్లి సాయంత్రం వేళలో సెటిల్‌మెంట్ చేసి విడిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులను తన గుప్పిట్లో పెట్టుకున్నట్లు, ఏమైనా తేడా జరిగితే బదిలీ చేయిస్తానని బహిరంగంగానే చెబుతున్నట్లు సమాచారం.

ఉమ్మడి గుంటూరు పరిధిలోని పలు జూద క్లబ్‌లను మూసివేశారు. అయితే రహస్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆడిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికుల నుంచి డిమాండ్ వస్తోంది. దసరా వేళ శని, ఆదివారాల్లో జిల్లాలో చాలాచోట్ల రహస్య స్థావరాలు ఏర్పాటు చేసి జూదం ఆడించనున్నారనే వార్తలొస్తున్నాయి. అంతేకాకుండా నగదు కూడా భారీగా చేతులు మారనుందని, రూ.లక్షల్లో పందేలు కాయనున్నారని తెలుస్తోంది.



☛ నాలుగు రోజుల క్రితం చీకటి కాలనీలో రాత్రిపూట ఐదుగురు జూదగాళ్లు, రూ.లక్ష నగదును పోలీసులు పట్టుకున్నారు. నరసరావుపేట మండల పరిధిలో ఎక్కువగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి రోడ్డులోని సాయినగర్, పమిడిపాడు, ములకలూరు, కోటప్పకొండను ఆనుకుని ఓ రిసార్టు, నరసరావుపేట మండలం లక్ష్మీపురంలో జూదం విచ్చలవిడిగా సాగుతున్నా పోలీసులు దాడులు చేయలేకపోతున్నారు. వినుకొండ రోడ్డులోని ఓ ప్రముఖ రిసార్టులో జూదం జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడరు. అలాగే, ప్రకాశ్‌నగర్‌లో కూడా ఆడిస్తున్నారు. రొంపిచర్ల మండలంలో కొన్ని గ్రామాల్లో జోరుగా సాగుతోంది. వీటిని కొందరు రాజకీయ ప్రముఖులే నడిపిస్తుండడంతో పోలీసులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

✦ తెలుగు యువత కీలక నేత, ఎమ్మెల్యే మేనల్లుడు, ఎమ్మెల్యేకు కుడిభుజంలా ఉండే వ్యక్తి జూదాల నిర్వహణలో కీలకపాత్ర వహిస్తున్నాడు. కొన్ని రిసార్టుల్లో అయితే ఏసీలు, మెత్తని పరుపులు, విందు భోజనంతో పాటు సకల సౌకర్యాలు, బయట కాపలా ఇలా పకడ్బందీ ఏర్పాట్లతో ఆడిస్తున్నారు. వాట్సప్ కాల్స్‌తో మాత్రమే మాట్లాడుకుంటారు. మూడో కంటికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. మరోవైపు పోలీసులకు జూదం కాసులపంట కురిపిస్తోంది. ఏదో నామమాత్ర తనిఖీలు చేస్తూ దొరికినపుడు తక్కువ మొత్తం నగదు చూపిస్తున్నారు. పెద్దవాళ్ల జోలికి పోవడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తే తప్ప వారంతటవారు వెళ్లి స్థావరాలపై దాడులు చేసిన సందర్భాలు లేవనే చెప్పాలి. ఇప్పటికైనా పోలీసులు పక్షపాతం లేకుండా వ్యవహరిస్తూ జూదంపై ఉక్కుపాదం మోపాలని నరసరావుపేట వాసులు కోరుతున్నారు.

కోడలిపై అత్త ఫిర్యాదు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తన కోడలు ఆదరించడం లేదంటూ పిడుగురాళ్లకు చెందిన వడ్డెంగుంట శేషవాణి మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లిలో మంత్రి లోకేశ్ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2012లో వినుకొండ ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పనిచేస్తూ అనారోగ్యంతో భర్త చనిపోయాడు. కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందిన కుమారుడు 2021లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఒంటరిగా మిగిలిన తనను కోడలు ఆదరించడం లేదని వాపోయింది. కుమారుడు మృతికి సంబంధించి బీమా రూ.65 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం అనుభవిస్తూ కోడలు దుర్గావాణీ తనకు అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అమరేశ్వరుని సేవలో కార్మికశాఖ మంత్రి

అమరావతి, న్యూస్‌టుడే: పంచారామ క్షేత్రం అమరావతిలోని అమరేశ్వరుడిని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణ అధికారి వేమూరి గోపి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామికి ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు.


మంత్రి సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

ఆర్టీసీని గాడిలో పెడుతున్నాం

- ✤ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై త్వరలో నిర్ణయం
- ✤ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్

వినుకొండ, న్యూస్‌టుడే : వైకాపా ఐదేళ్ల పాలనలో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాన్ని గాడిలో పెట్టే పని చేపట్టామని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వంలో విలీనం చేసినా.. ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో మార్పు లేదని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆహ్వానం మేరకు వినుకొండ బస్టాండ్‌ను శుక్రవారం ఆయన సందర్శించి ఆరు కొత్త బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు 1450 బస్సులు కొనగా.. 800పైగా రోడ్డుపైకి తెచ్చామని, ప్రయాణికులు, కార్మికులు ఆర్టీసీకి రెండు కళ్లు అని.. సంస్థ బతకాలంటే వనరులు, వసతులు కావాలన్నారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం, ఆసరా పథకంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. జగన్ పాలనలో ఉద్యోగం అంటే వాలంటీర్లు అన్నారు. నేడు మా ప్రభుత్వం శాశ్వత ఉద్యోగాలకు సమాయత్తం 16,500 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు.


జెండా ఊపి నూతన బస్సు ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పక్కన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాజీ ఎమ్మెల్యే మక్కెన, ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు

వినుకొండలో అభివృద్ధికి సహకారం

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పరిశీలించిన మంత్రి గ్యారేజీలో మొక్కలు నాటారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రానున్న ఐదేళ్లలో వినుకొండను అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. అలాగే 175 నియోజకవర్గాల్లో అభివృద్ధిని నడిపిస్తామని అన్నారు. వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణతో పాటు ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాల నిర్మాణాలకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రూ.15 కోట్లతో మోడల్ బస్టాండ్, రూ.5 కోట్లతో స్టేడియం నిర్మాణానికి మంత్రి అంగీకరించారని చెప్పారు. అనంతరం నాయకులు ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు ఖాజా, సాంబశివరావు తదితరులు మంత్రులను కలిసి సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరావు, డీపీటీవో శ్రీనివాసరావు, డిప్యూటీ సీఎంఈ సురేష్ బాబు, మేనేజర్ జవ్వాజి నాగేశ్వరరావు, భాజపా జిల్లా కార్యదర్శి మేడం రమేష్, తెదేపా నాయకులు ఆయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

నవంబరు 10న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రారంభం


బ్లడ్‌బ్యాంకులో రెడ్‌క్రాస్ నేతలతో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ వైద్యశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహించే కాంపోనెంట్ బ్లడ్ బ్యాంకు నవంబరు 10న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ప్రభుత్వ వైద్యశాలను శుక్రవారం ఎమ్మెల్యే సందర్శించారు. బ్లడ్‌బ్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో 200 పడకల వైద్యశాల ఉందని, బ్లడ్ బ్యాంకుతో మరిన్ని వైద్యసేవలు అందుతాయన్నారు. 1000 యూనిట్ల నిల్వ సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని రక్తం అవసరమైన వారికి పూర్తిస్థాయిలో అందుతుందని చెప్పారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభోత్సవానికి హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ అందజేసిన రక్త సేకరణ వాహనాన్ని ప్రారంభించారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ కేజే మోహన్‌రెడ్డి, సభ్యులు ఉన్నారు.

104 పరుగులకు అనంతపురం ఆలౌట్

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో అండర్- 14 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీల్లో భాగంగా తొలుత బ్యాటింగ్ చేపట్టిన అనంతపురం జట్టు 104 పరుగులకు ఆలౌట్ అయింది. ఓవర్‌నైట్ స్కోర్ ఆరు వికెట్ల నష్టానికి 91 పరుగుల వద్ద శుక్రవారం రెండోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మరో 13 పరుగులు చేసి మిగిలిన నాలుగు వికెట్లను కోల్పోయింది. జట్టులో భువన్ 28 పరుగులు చేశాడు. శ్రీకాకుళం బౌలర్లు జోష్మిత్ 3 వికెట్లు, పరాన్ 2 పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 16 ఓవర్లలో వికెట్ నష్టానికి 40 పరుగులు చేసింది. ఆ సమయంలో వర్షం పడటంతో ఆట నిలిపివేశారు.

✤ వర్షాల కారణంగా మ్యాచ్‌లు రద్దు

✤ వర్షంతో నిలిచిన మ్యాచ్

అండర్- 14 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీల్లో తదుపరి నిర్వహించే మ్యాచ్‌లు భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా రద్దు చేశామని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు తెలిపారు. త్వరలో మ్యాచ్‌ల నిర్వహణ తేదీలను ప్రకటిస్తామని చెప్పారు.

గొడవలకు దిగితే చర్యలు

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆయన క్రోసూరు, నాగవరం, దొడ్లేరు, హసనాబాద్ పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, రిటైల్ ధర - 147, చికెన్ విత్‌స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -125 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213, చికెన్ స్కిన్‌లెస్ - 243.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

కోట సుబ్బారావు సేవలు మరువలేం


నివాళి అర్పిస్తున్న వ్యాపారులు, క్లబ్ సభ్యులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ది పిడుగురాళ్ల పల్వరైజింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా కోట సుబ్బారావు అందించిన సేవలు మరువలేమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో కోట సుబ్బారావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పల్వరైజింగ్ మిల్లుల యజమానులు, కుటుంబ సభ్యులు, రోటరీక్లబ్ సభ్యులు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మాజీ సర్పంచి భవనాసి యల్లారావు, పల్వరైజింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఆత్మకూరి శ్రీనివాసరావు, కోశాధికారి కొత్త శ్రీనివాసరావు, కాకుమాను గోపి, జుజ్జూరి పుల్లారావు, కనిగిరి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు మల్లికార్జునరావు, రమేష్, మురళి, కోట హరి, శివ, రోటరీక్లబ్ సభ్యులు వైద్యులు పి.విష్ణుబాబు, పి.సుబ్రహ్మణ్యం, జి.గురవయ్య, వి.గోపి, ముత్తారెడ్డి, జి.సుబ్రహ్మణ్యం, ఎ.చెంచయ్య, కె.శంకరరావు, కె.హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష తగదు


బహుమతులు అందుకున్న బాలికలతో డీఆర్వో వినాయకం, డీఎంహెచ్‌వో రవి తదితరులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : బాలికల పట్ల వివక్ష సరికాదని, ప్రోత్సహిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారని వక్తలు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో వినాయకం, డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, తదితరులు మాట్లాడుతూ 18 ఏళ్ల వయసు లోపు బాలికలకు పౌష్టికాహారం, విద్య అందించాలని, హింస నుంచి రక్షణ కల్పించాలని తెలిపారు. విద్యతో పాటు కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల కారణంగా బాలికల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు రూ.10 వేల చెక్కులు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పీడీ ఉమా మహేశ్వరి, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు దుర్గారాణి, వెనరసి, జీడీసీవో రేవతి పాల్గొన్నారు.

యువరైతు ఆత్మహత్య

దాచేపల్లి, న్యూస్‌టుడే: అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దాచేపల్లి మండలం నడికుడి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కుంచల సాంబయ్య కుమారుడు నరేంద్ర(24) పంటలు సాగు చేస్తున్నాడు. గతేడాది అయిదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప వేశాడు. పంట దిగుబడి సరిగా రాక రూ.6 లక్షలు అప్పు అయ్యింది. అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మదనపడుతున్నాడు. ఈక్రమంలో గురువారం రాత్రి కుటుంబ సభ్యులందరూ గ్రామంలో బతుకమ్మ వేడుకలకు వెళ్లగా.. ఇంట్లో ఒంటరిగా ఉన్న నరేంద్ర ఉరివేసుకున్నాడు. రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గుర్తించి శోక సంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకట్రావు, ఎస్సై పాపారావు తెలిపారు.

జిల్లా ప్రజలకు విజయ దశమి శుభాకాంక్షలు : ఎస్పీ

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లా ప్రజలందరితో పాటు పోలీసు సిబ్బంది, అధికారులకు ఎస్పీ కంచి శ్రీనివాసరావు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఈ పర్వదినాన్ని నిర్వహించుకోవాలని ఆయన శుక్రవారం జారీ చేసిన ఓ ప్రకటనలో కోరారు.

జిల్లాలో మద్యం దుకాణాలకు 2,621 దరఖాస్తులు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని 129 మద్యం దుకాణాలకు శుక్రవారం రాత్రి తుది గడువు ముగిసే సమయానికి 2,621 దరఖాస్తులు వచ్చాయని ఈఎస్ మణికంఠ తెలిపారు. నరసరావుపేట అబ్కారీ శాఖ జిల్లా కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ.. తుది గడువు రాత్రి 7 గంటలకు ముగిసినప్పటికీ, ఆ సమయానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారులు బ్యాంకు డీడీలు సమర్పించడంలో జాప్యం చోటు చేసుకుందన్నారు. దీంతో స్వల్పంగా దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశముందన్నారు. చివరి రోజు సుమారు 700పైగా దరఖాస్తులు దాఖాలు చేశారని ఆయన వివరించారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రేషన్ బియ్యం పట్టివేత

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న 80 బస్తాల రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అశోక్ నేతృత్వంలో తనిఖీలు చేస్తుండగా ఫిరంగిపురానికి చెందిన కుంభా నాగరాజు నరసరావుపేట- కోటప్పకొండ రోడ్డులో ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 80 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకుని స్టేషన్ తరలించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

రేపు సీతారాముల కల్యాణం

వినుకొండ : భక్తుల కోరికల అభీష్టసిద్ధి కోసం ఈనెల 13న బోసుబొమ్మ సెంటర్లోని షిర్డీసాయి మందిరంలో సామూహిక సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యుడు గోనుగుంట్ల సుదర్శనరావు తెలిపారు. పీటలపై కూర్చునేవారు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదని, సంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు.

శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో చోరీ

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : మండలంలోని ఉప్పలపాడు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామీణ పోలీసుల కథనం మేరకు దొంగలు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి అందులో ఉన్న నగదు చోరీ చేశారు. ఎంత పోయింది అనేది తెలియాల్సి ఉంది. సుమారు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఉండవచ్చని కమిటీ సభ్యుడు జూపల్లి వీరయ్య తెలిపారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై కిషోర్ తెలిపారు.

జయ జయ మహిషాసురమర్దిని


గంటావారిపాలెంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు


రొంపిచర్ల శ్రీవాసవీ అమ్మవారు


చిలకలూరిపేట : దాసరికాలనీలో


పాతూరులోని భీమలింగేశ్వరాలయంలో

న్యూస్‌టుడే, బృందం :

దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయాలు కిటకిటలాడాయి. భక్తజనం తరలివచ్చి.. అమ్మవారిని పూజించారు. ఆలయాల్లో అమ్మవారికి మహిషాసురమర్దిని అలంకారం చేశారు.


విఠంరాజుపల్లిలో


బోయపాలెంలోని పార్వతీ దేవి ఆలయంలో


ముప్పాళ్లలో


జగన్మాత పీఠంలో


పసుమర్రు శివాలయంలో


పాతూరులో చండీహోమం

ఆకట్టుకున్న జగన్మాత చిత్రం



వినుకొండ, న్యూస్‌టుడే : దసరా సందర్భంగా పట్టణానికి చెందిన చిత్రకారుడు బి.ప్రసాద్ గీసిన అక్షర జగన్మాత బొమ్మ అకట్టుకుంటుంది. నుదుటిపై 'ఓం', ముక్కుపైన దుర్గాదేవి, పెదవిపై దసరా, తలపైన విజయదశమి, కంఠంపైన శుభాకాంక్షలు అనే అక్షరాలు చిత్రీకరించారు. ప్రతి పండక్కి దాని విశిష్టతను తెలియజేస్తూ బొమ్మలను గీయడం ఆయన ప్రత్యేకత.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని పసుమర్రులో స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాటు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సమతా విభాగం జిల్లా అధ్యక్షురాలు టి.కుమారి పాల్గొని మాట్లాడారు. జాతికి గౌరవం తెచ్చేది బాలికలే అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాలికలు చాలా అప్రమత్తంగా ఉండాలని, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెద్దలు, గురువులు చెప్పే మంచి విషయాలు గౌరవించాలని, ఆడపిల్లలుగా పుట్టడం మన అదృష్టమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, సంస్థ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు, దానయ్య, చంద్రం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కనమర్లపూడి (శావల్యాపురం) : మండలంలోని కనమర్లపూడిలో ఇటీవల కాలంలో పాలడుగు వెంకయ్య అనారోగ్య కారణాలతో మరణించాడు. శుక్రవారం దశదిశ కార్మకాండలు చేశారు. తెదేపా మండల మాజీ అధ్యక్షుడు బోడెపూడి ప్రసాద్ వెంకయ్య కుటుంబానికి రూ.20 వేలు సాయం చేశారు.

శాంతి ఆశ్రమంలో ఓంకార క్రియ పూజ

వినుకొండ రూరల్: శాంతి ఆశ్రమానికి దసరా సందర్భంగా మూడేళ్లుగా వస్తున్నట్లు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద హిమాలయ గురాజీ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురాజీ ఓంకార క్రియ పూజ, కుంకుమ పూజ నిర్వహించి, రాజశ్యామల యాగం చేశారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బ్రహ్మారెడ్డి దంపతులు

విజయ దశమి శుభాకాంక్షలు

Advt Spl. Feature

శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి



త్రిపురాత్రయంలో శ్రీ బాలాత్రిపురసుందరీదేవి మొదటిది. బాలాదేవి ఎంతో మహిమాన్వితమైనది. ఈమెను ధ్యానిస్తేనేదుర్గాదేవి సంతోషిస్తుంది. సకల భక్తి పూజలకీ ఉపాసవలకీమూలమైన శ్రీ బాలాదేవి ముగ్ధమనోహరమైన జగన్మోహనాతారాన్నిపవిత్రమైన ఈ శరన్నవరాత్రులతో దర్శించి ఆమె అనుగ్రహాన్నిపొందితే సంవత్సరం పొడవునా మనం అమ్మవారికి చేసే,చేయించుకునే పూజలన్నీ సత్ఫలితాన్ని సత్కర ఫలితాన్ని ఇస్తాయని నమ్మిక, శ్రీచక్రంలో మొదటి అమ్నాయంలో ఉండే మొదటి దేవత బాలాదేవి

శ్రీ గాయత్రీదేవి



సకలమంత్రాలకీ మూలమైన శక్తిగా వేదమాతగాప్రసిద్ధిగాంచిన శ్రీ గాయత్రీదేవి ముక్తా, నిద్రుమ, హేమ, నీల,ధవళ, వర్ణాలతో ప్రకాశిస్తూ పంచముఖాలతో దర్శనమిచ్చేసంధ్యావందన అదిష్ఠాన దేవత, శ్రీ గాయత్రీదేవి మంత్రప్రభావం ఎంతో గొప్పది. "గాయంతాం రయతీత గాయత్రి"గాఅంటూ గానం చేసేవారిని (తనరూపాన్ని)రక్షించేది అని.గాయత్రికి పేరు. అలాగే ఛాందోగ్యోపనిషత్తులో "వాగ్వైగాయత్రీ" అంటే మనంమాట్లాడే వాక్కే గాయత్రీ అనే అర్థం చెప్పబడింది.

శ్రీ అన్నపూర్ణాదేవి



అన్నం పరబ్రహ్మ స్వరూపం, అన్నం సర్వ జీవనాధారంఅటువంటి అన్నాన్ని ప్రసాదించేది శ్రీ అన్నపూర్ణాదేవి. నిత్యాన్నదానేశ్వరిగా నిటాలాక్షప్రాణేశ్వరిగా అన్నపూర్ణాదేవితనబిడ్డమైన మనకే గాక సకల జీవరాశులన్నింటికి ఆహారాన్నిప్రసాదిస్తుంది. ఆమెనే కాశీ అన్నపూర్ణ అని పిలుస్తారు. ఈజీవకోటి సశించిపోకుండా కాపాడుతుంది. ఇలా జీవకోటికి ఆహారాన్నందించే అన్నపూర్ణాదేవి నిజనివాసం వారణాసిక్షేత్రం.

"భిక్షాందేహి కీపావలంబన కరీ మాతా అన్నపూర్ణేశ్వరీ"

శ్రీ మహాలక్ష్మీ దేవి



శ్రీ కనకదుర్గమ్మ త్రిశక్తుల్లో ఒకటైన మహాలక్ష్మి స్వరూపిణి 1.సత్యలక్ష్మి, 2. భోగలక్ష్మి, 3.రాజ్యలక్ష్మి, 4. యోగలక్ష్మి, 5.విద్యాలక్ష్మి, 6.సౌభాగ్యలక్ష్మి, 7.అమృతలక్ష్మి 8.కామ్యలక్ష్మి అనేఎనిమిది విధాలుగా మహాలక్ష్మీదేవి కనిపిస్తుంది. అంతేకాదు, 1.ధనలక్ష్మి, 2. ధాన్యలక్ష్మి, 3. ధైర్యలక్ష్మి, 4.విజయలక్ష్మి, 5.ఆదిలక్ష్మి, 6. విద్యాలక్ష్మి, 7. గజలక్ష్మి, 8.సంతానలక్ష్మి, అనిమరొక ఎనిమిది రకాల అష్టలక్ష్ములు కూడా లోకంలో ప్రసిద్ధమయ్యాయి. దుర్గమ్మఆలయ కుడ్యాలలో అష్టలక్ష్మి విగ్రహాలను అందంగా ప్రతిష్ఠించారు.

శ్రీ సరస్వతీ దేవి (మూలానక్షత్రం)



చదువుల తల్లి సరస్వతీదేవి మానవులకు సకలవిద్యలనూప్రసాదించి వారిలో జ్ఞానదీపాన్ని వెలిగించే విద్యాశక్తి, సరస్వతిఅమ్మవారి జన్మనక్షత్రమైన మూల నక్షత్రం రోజున చేసేఅలంకారానికే ఎక్కువ ప్రాధాన్యత ఏర్పడింది. ఆ కారణంగాలక్షలాది మంది ప్రజలు అమ్మను దర్శించి ఆమె అనుగ్రహాన్నికొనుకగా తీసుకువెళ్లాలని ఆశతో వస్తారు. ప్రభుత్వం వారుమూలనక్షత్రం రోజున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీ లలితా త్రిపురసుందరీదేవి




త్రిపురాత్రయంలో రెండవ శక్తి ఈ లలితాదేవి బ్రహ్మ, విష్ణు,మహేశ్వరుల కన్నా పూర్వం నుంచి ఉన్నది. కాబట్టిత్రిపురసుందరి అని పిలువబడుతోంది. ఈ లలితాత్రిపురసుందరి శ్రీ చక్ర అధిష్ఠానశక్తిగా, పంచదశాక్షరి మహామంత్రాధిఃి దేవతగా తనను కొలిచే భక్తులను ఉపాసకుల్నిఅనుగ్రహిస్తుంది. శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలోఆదిశంకరాచార్యచే ప్రతిష్ఠితమైన శ్రీ చక్ర మహాయంత్రం ఏదైతే వుందో, ఆశ్రీచక్రానికి అధిష్ఠాన దేవత కూడా ఈ లలితా త్రిపుర సుందరీదేవే.

శ్రీ దుర్గాదేవి (దుర్గాష్టమి)



అశ్వయుజ శుద్ధ అష్టమి నాడు అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరిస్తారు. దుర్గతుల్ని నాశనం చేసిదుర్గాదేవి " దుఃఖేన గుంతు శక్యతే ఇతి దుర్గా" అనిఅంటారు. అటువంటి శక్తి స్వరూపిణి దుర్గాదేవి అష్టమి తిథిరోజున రురుకుమారుడైన దుర్గముడు అనే రాక్షసుణ్ణిసంహరించింది. కాబట్టే లోకంలో దుర్గా అని కీర్తించబడింది.ఆ అష్టమి దుర్గాష్టమి అని ప్రసిద్ధి పొందింది. మహాకాళి,మహాసరస్వతి, మహాలక్ష్మిలకు దుర్గాదేవిని మూలపుటమ్మగా తొలుస్తారు.

శ్రీ మహిషాపురమర్దనీదేవి



మహిషాసురుడి వల్ల తీవ్రమైన కష్టాలు పడుతున్న ఇంద్రాది దేవతలంతా తమ తమ శరీరాల్లోంచి దివ తేజస్సుల్ని బైటికి ప్రసరించారు. ఆ తేజస్సులన్నీ కలిసిపోయి ఒక దివ్య తేజోమూర్తి పుట్టింది. ఆతేజోమూర్తికి వివిధ దేవతలంతా తమ తమ ఆయుధాల్ని సమర్పించారు. హిమవంతుడు తనవంతుగా ఒకసింహాన్ని ఆ తల్లికి వాహనంగా ఇచ్చాడు. అలా సింహవాహినిగా రూపొందిన ఆ శక్తి వికటాట్టహాసం చేసి, మహిషాసురుడి సేనావతులైన రాక్షసులందరినీ సంహరించింది. ఆ తరువాత యుద్ధంలో దేవి అవలీలగా మహిషాసురుణ్ణి సంహరించి అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రిమీద వెలిశారు.

శ్రీ రాజరజేశ్వరి దేవి



అశ్వయుజ శుద్ధ దశమి రోజున అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరిస్తారు. మహాత్రిపుర సుందరి, శ్రీచక్రఅధిష్ఠాన దేవత ఈమె. శ్రీ లలితాదేవినే రాజరాజేశ్వరిగాకొలుస్తారు. పరమశాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూఇక్షు ఖండాన్ని (చెరకుగడ)చేతిలో ధరించి ఒకచేత అభయముద్రను చూపిస్తూ దర్శనమిస్తుంది. అపరాజితాదేవి స్వరూపమైన రాజరాజేశ్వరీదేవిని దర్శించినవారికి అపజయమే ఉండదని నమ్మిక.

"చిద్రూపి పరదేవత భగవతి శ్రీ రాజరాజేశ్వరి"

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

బాలికలు బంగారం


విద్యార్థినుల ర్యాలీ

సత్తెనపల్లి: బాలికలు బంగారం అని ఆడబిడ్డల్ని పుట్టనిద్దాం, చదివిద్దాం, ప్రయోజకుల్ని చేద్దామని ఐసీడీఎస్ ఎస్‌డీపీవో సంతోషకుమారి, సూపర్‌వైజర్ అరుణ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రదర్శన, సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, ఆశ, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అమోఘం


లక్కీడిప్ విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య సోదరులు సమాజం పట్ల చిత్త శుద్ధితో సహాయ సహకారాలు అందిస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం లక్కీడిప్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రసన్నాంజనేయస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామి, కనకదుర్గమ్మతల్లి, గంగమ్మగుడి, నాగులగుడిలో యరపతినేని పూజలు చేశారు.

14 నుంచి పల్లె పండగ

రాజుపాలెం: పల్లె పండగ కార్యక్రమం ఈనెల 14 నుంచి 20 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యన్నారాయణ తెలిపారు. 15న రెడ్డిగూడెం, ఆకులగణపవరం, బలిజేపల్లి, ఇనిమెట్ల, 16న అంచులవారిపాలెం, కొత్తబోధనం, చౌటపాపాయపాలెం, రాజుపాలెం, 17న బ్రాహ్మణపల్లి, బీరవల్లిపాయ, కొత్తూరు, ఉప్పలపాడు గ్రామాల్లో జరుగుతుందన్నారు.

విద్యార్థిని చదువుకు సాయం

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువుకు చెందిన పేద పీజీ విద్యార్థిని మేదర భాను ప్రసన్నకు వసతిగృహం ఫీజు రూ.25,000 స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తుమ్మా శౌర్రెడ్డి శుక్రవారం అందజేశారు. విద్యార్థిని ఆంధ్రా యూనివర్సిటీలో చదువుతోంది. ఆమెకు వసతిగృహ ఫీజు అందించారు.

దసరాకు వచ్చి.. దాడికి గురై..

వెల్దుర్తి: సరదాగా గడుపుదామని హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చిన ఓ యువకుడు దాడికి గురైన ఘటన వెల్దుర్తి మండలంలో చోటుచేసుకుంది. గొట్టిపాళ్లకు చెందిన నాగరాజు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. దసరా సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. శుక్రవారం పీర్లచావిడి వద్ద కూర్చొని సెల్‌ఫోన్ చూస్తుండగా అతడు, అతని సోదరుడిపై అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య, అతని తండ్రి కోటేశ్వరరావు కర్రలతో దాడిచేశారు. ఈ దాడిలో నాగరాజు తలకు తీవ్ర గాయమై.. రక్తస్రావం అయింది. పాతకక్షలతో దాడి జరిగిందని స్థానికులు తెలిపారు.

జయ జయహే మహిషాసురమర్దిని


గురజాల గ్రామీణ: కనకదుర్గ అమ్మవారు..


మాచవరంలో వాసవీ మాత


మాచవరం శివాలయంలో భ్రమరాంబ


రాజుపాలెం: ఆకులగణపవరంలో..


అచ్చంపేట వాసవీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో..


అచ్చంపేటలో..


పెదమక్కెనలో..


గురజాలలో..


రెంటచింతలలో..

దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు చేశారు. పలుచోట్ల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, బృందం


సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో..


మాచర్లలో కన్యకాపరమేశ్వరి


కారంపూడిలో అంకాళమ్మ


సత్తెనపల్లి: నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు


కారంపూడి: బతుకమ్మ పూజల్లో మహిళలు



పిడుగురాళ్ల: కుంకుమ పూజ చేస్తున్న మహిళలు


సత్తెనపల్లి: వడ్డవల్లి బొడ్రాయి సెంటర్‌లో..


సత్తెనపల్లి: సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో..


పరస రామాలయంలో..


విజయపురిసౌత్‌లో భక్తులకు అన్నదానం


పిడుగురాళ్లలో


దాచేపల్లిలో..


పిడుగురాళ్ల: నాగులగుడిలో..


అమరావతిలో బాలచాముండికా

కొనసాగుతున్న పూడికతీత పనులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని తంగెడ, ఆకురాజుపల్లి మేజరు కాలువల్లో మరమ్మతుల పనులు రెండోరోజు శుక్రవారం జరిగాయి. తంగెడ మేజరులో 12 జేసీబీలను ఏర్పాటు చేశారు. శాంతినగరం, ముత్యాలంపాడు సమీపంలో కొన్ని యంత్రాలు, పెదగార్లపాడు సమీపంలో కొన్ని యంత్రాలు ఏర్పాటు చేసి కాలువలో పూడిక, తూటును తీసి పక్కన వేస్తున్నారు. శనివారం మరో నాలుగైదు జేసీబీలను తెప్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చివరి ఆయకట్టుకు నీరిస్తాం

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు సెక్షన్ పరిధిలోని కాలువ చివరి భూములకు సాగునీరందించేందుకు కృషి చేస్తానని ఎన్నెస్పీ క్రోసూరు సెక్షన్ ఏఈ బండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తాను ఇటీవల బదిలీల్లో భాగంగా దాచేపల్లి నుంచి ఇక్కడికి వచ్చానన్నారు.

14న పెదకూరపాడులో ప్రజాదర్బార్

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 14న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు జిల్లా తెదేపా కార్యదర్శి అర్తిమళ్ల రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

పీఎం సూర్యఘర్ సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి సింగయ్య

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి సింగయ్య, ఎస్‌ఈ విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక గోశాల కల్యాణ మండపంలో శుక్రవారం విద్యుత్తుశాఖ అధికారులు, ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పీఎం సూర్యఘర్‌కు ఇప్పటివరకు ఒక్కో మండలం నుంచి నాలుగైదు దరఖాస్తులే వచ్చాయని, ప్రజల్లో విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సోలార్ విద్యుత్తు పరికరాల ఏర్పాటుతో బిల్లులు తగ్గించుకోవడమే కాకుండా ఇంటి అవసరాలన్నీ తీర్చుకోవచ్చన్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమే


కల్వర్టులు లేక రోడ్డుపై పారుతున్న మురుగు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నిధులున్నా పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా మురుగు, వర్షపు నీరు రోడ్డుపై చేరుతోంది. పట్టణంలోని పదోవార్డు నందిగామ డొంక రోడ్డులో మూడు కల్వర్టుల నిర్మాణానికి రూ.4.10 లక్షలు మున్సిపల్ సాధారణ నిధులు కేటాయించారు. పనులకు అనుమతులిచ్చినా కల్వర్టుల నిర్మాణం పూర్తవ్వకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

అచ్చంపేట: స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో రెండు మండలాల స్థాయి దసరా క్రికెట్ పోటీలు శుక్రవారం రసవత్తరంగా సాగాయి. క్రోసూరు -గింజుపల్లి జట్ల మధ్య జరిగిన ఆటలో క్రోసూరు జట్టు 5 వికెట్లు నష్టపోయి విజయం సాధించింది. పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు మహేష్‌రెడ్డి, నరసింహనాయుడు పేర్కొన్నారు. ప్రథమంగా నిలిచిన జట్టుకు మండల తెదేపా నాయకుడు వెనిగండ్ల కోటయ్య రూ.20,000, ద్వితీయ జట్టుకు రూ.10 వేలు బత్తుల కోటేశ్వరరావు స్పాన్సర్ చేశారన్నారు.

రతన్‌టాటా సేవలు చిరస్మరణీయం


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దేశాభివృద్ధి, ప్రజాశ్రేయస్సు, మూగజీవాల సంరక్షణ, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూపు సంస్థలను నిబద్ధతతో నిర్వహించిన రతన్‌టాటా సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం రతన్‌టాటా సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్‌టాటా అని కొనియాడారు. తెదేపా నాయకులు నాగేశ్వరరావు, ఆదినారాయణ, వెంకటకోటయ్య, వెంకటేశ్వరరావు, అమరేశ్వరరావు, జానిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొండపిలో చోరీ

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని తొండపి గ్రామంలో చోరీ ఘటన శుక్రవారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కార్పెంటర్ షేక్ మొగల్ నాగూల్ భార్య, పిల్లలు ఊరికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉండలేక నాగూల్ తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి అక్కడే నిద్రపోయాడు. తెల్లారి ఇంటికి వచ్చేసరికి తాళం పగలగొట్టి బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా బయట పడేసి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించాడు. 15 సవర్ల బంగారాన్ని దొంగలు చోరీ చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రకటన

మహారాజశ్రీ ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గుంటూరు వారి కోర్టులో
OS. 1271/2022

మధ్య
దారం వీరకుమారి ... వాది
Vs
1) గుమ్మా శ్రీలక్ష్మి ... ప్రతివాదులు
2) గుమ్మా భూలక్ష్మి

To: గుమ్మా శ్రీ లక్ష్మి, W/o. గుమ్మా నరసింహారావు, D/o. ఉదారపు ఎలమందరావు, హిందువు, వయస్సు షుమారు 32 సంవత్సరాలు, వైకుంటపురం, అమరావతి మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాను వాది తనకు రావలసిన ప్రామిసరీ నోటు బాకీ, వడ్డీ మరియు ఖర్చులతో పాటు రాబట్టుకొను నిమిత్తం మీ పైన మరియు 2వ ప్రతివాది పైన పై నంబరు దావా దాఖలు చేసి కోర్టు ద్వారాను మరియు పోస్ట్ ద్వారాను ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశపూర్వకంగా తప్పుకుంటూ ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు మీకు దావా సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా ఇవ్వడం అయినది. కావున పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీరు ది. 16-10-2024న ఉదయం 10.30 గంటలకు పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట పై నెంబరు దావాలో స్వయముగా గాని లేక న్యాయవాది ద్వారా గాని హాజరుపడి మీ సమాధానము తెలుపుకోగలరు. లేనియెడల మీ పరోక్షములో పై నెంబరు దావా తీర్మానించబడును అని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

ఇట్లు
దూళ్ళ శ్రీనివాసరావు, అడ్వకేటు
1వ లైను, మారుతీనగర్, నందివెలుగు రోడ్, పాతగుంటూరు, గుంటూరు
గుంటూరు
Dt:9-10-2024
Ph: 78932 01109

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అమరావతి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని మల్లాదిలో సరదాగా ఈతకు వెళ్లి కృష్ణానదిలో గల్లంతైన నండూరు సాల్మన్‌రాజు(17) మృతదేహం రెండు రోజుల తరువాత లభ్యమైంది. యువకుడి గాలింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారని బంధువులు ఆందోళన నిర్వహించడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బలగాలను రంగంలోకి దించారు. శుక్రవారం గాలిస్తుండగా ధరణికోట వద్ద మృతదేహం లభ్యమైంది.

ఎస్సీ వర్గీకరణపై పున:పరిశీలించాలి


నిరసన ప్రదర్శనలో నాయకులు

సత్తెనపల్లి: ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పున: పరిశీలించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ నియోజకవర్గ మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళిత, గిరిజనుల రిజర్వేషన్లు ఎత్తివేసే ప్రక్రియలో భాగంగానే వర్గీకరణ నిర్ణయం వెలువడిందని ఆరోపించారు. ర్యాలీ అనంతరం మాలమహానాడు నియోజకవర్గ బాధ్యులుగా మాలే పద్మారావు, మనికె మహేష్‌లను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, నాయకులు బాల, కిరణ్, చంద్ర, సుధాకర్, రమేష్, డేవిడ్, కోటేశ్వరరావు, దేవదాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

కోడి గుడ్లతో పోషకాలు

అమరావతి: అంతర్జాతీయ గుడ్డు దినోత్సవం సందర్భంగా సీజేబీ, సీఎల్ఎం పౌల్ట్రీ ఫాం ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు ఉచితంగా గుడ్లు పంపిణీ చేశారు. నిర్వాహకులు చేకూరి లక్ష్మీ మాట్లాడుతూ రోజు గుడ్డు తింటే సరైన పోషకాలు అందుతాయన్నారు.

దసరా వచ్చింది... సరదా తెచ్చింది...

★ వివిధ రాష్ట్రాల్లో సంబరంగా పండగ
★ దసరా విశిష్టతపై వివిధ రాష్ట్రాల వలస కార్మికుల మనోభావాలు ఇలా...

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే


ఒడిశాలో దసరా ఉత్సవం

దసరా దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సంబరంగా చేసుకుంటారు. ఒడిశా, బీహార్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో పండగ వైభవంగా చేస్తారని ఆయా రాష్ట్రాల నుంచి వలసవచ్చి పత్తి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఒడిశాలో శక్తి సంబంధిత దసరా అనాదిగా వస్తున్న ఆచారం. ప్రతి గ్రామం, పట్టణంలో సొంత దేవతలకు ప్రాధాన్యం ఇస్తారు. దేవాలయాలు, గృహాలు, కాకుండా ఒడిశాలో మరోక అంత గ్రాగంగా అలంకరించిన పూజా పలకాలలో (మట్టితో తయారు చేసినవి) ఆరాధిస్తారు. బీహార్‌లోని కొన్ని ప్రాంతాల్లో శరద్వత పుల్లో దుర్గాదేవిని పూజిస్తారు. భారీ సంఖ్యలో పండల్స్ తయారు చేస్తారు. దుర్గాదేవి, లక్ష్మీదేవి, కార్తికేయ, గణేష్ పూజలు చేస్తారు. ఉత్తరప్రదేశ్‌లో రాముడు రావణుడి ప్రతిమను దహనం చేసే ఉత్సవాలు చేసే అనేక ప్రదేశాలు ఉన్నాయి. ఇది చెడుపై మంచి సాధించిన విజయాన్ని వర్ణిస్తాయి.

తొమ్మిది రాత్రులు పూజిస్తాం



దసరా సందర్భంగా 9 రాత్రులు దుర్గాదేవిని పూజిస్తాం. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంద మాత, కాత్యాయని, కాలరాత్రి, దుర్గ, సిద్ధి ధాత్రి అలంకరణలో ఆరాధిస్తాం. కుటుంబ సభ్యులందరం కలిసి దేవతా విగ్రహాన్ని పూజిస్తాం. ఉపవాసం ఉండి ప్రార్థనలు చేస్తాం.
-పూజ, కార్మికురాలు, భద్రక్, ఒడిశా

కుమారి పూజ ముఖ్యమైంది



కుమారిపూజ అనేది నవరాత్రి వేడుకల్లో ముఖ్యమైనది. ఏడాది నుంచి తొమ్మిదేళ్ల వరకు ఉన్న బాలికలను ఆహ్వానిస్తాం. వారికి ఆభరణాలు, దుస్తులు బహుమతిగా ఇస్తాం. ప్రతి ఒక్కరూ దుర్గాదేవి అవతారంగా పూజిస్తాం. పూజ అయ్యాక వారికి భోజనం అందిస్తారు. ఈ ఆచారం అదృష్టాన్ని తెస్తుందని, కుటుంబం సంతోషంగా ఉంటుందని నమ్ముతారు.
-రష్మిత సుతార్, భద్రక్, ఒడిశా

ప్రయాణానికి లోపించిన భరోసా

మూడేళ్లుగా నిర్వహణ లేని రహదారులు ★ ఎమ్మెల్యేల ఒత్తిడితో అధికారుల ఉక్కిరిబిక్కిరి


నరసరావుపేట- సత్తెనపల్లి మార్గంలో గుంతలు

జిల్లా కేంద్రమైన నరసరావుపేట- సత్తెనపల్లి మార్గంలో ములకలూరు వద్ద నడిరోడ్డుపై చిన్నపాటి గుంత ఏర్పడింది. రాత్రిపూట దీన్ని గమనించడం కష్టమైన వాహన చోదకులు ప్రమాదాలకు గురై క్షతగాత్రులవుతున్నారు. వీరి వైద్యం కోసం ఆసుపత్రులకు చెల్లిస్తున్న సొమ్ము రూ.లక్షల్లో ఉంటుంది. అయితే ఇక్కడ రూ.500 ఖర్చుతో సమస్య పరిష్కరించొచ్చు. ఇది ఈ ఒక్క చోటే కాదు.. జిల్లాలోని రహదారులు భవనాల శాఖ రహదారులన్నిట్లో పరిస్థితి.

గణపవరం, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే

జిల్లాలో ర.భ శాఖ రహదారుల పొడవు	1737 కి.మీ
ఇందులో రాష్ట్రీయ రహదారుల పొడవు	555.5 కి.మీ
ఏడాదికి నిర్వహణ వ్యయం	రూ.4.5 కోట్లు

రహదారుల నిర్వహణ బాగుంటే సురక్షితమైన ప్రయాణంతో గమ్యస్థానం చేరుకుంటాం. నిత్యం జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుంది. చిన్నపాటి లోటుపాట్లతో తరచూ ఏదోక చోట ఘోర ఘటనలతో విలువైన ప్రాణాలు రోడ్డు పాలవుతున్నాయి. అనేకమంది గాయాలతో ఆసుపత్రుల్లో చేరి ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం మూడేళ్లుగా రూపాయి కూడా గత వైకాపా సర్కారు నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. భద్రమైన ప్రయాణానికి భరోసా కల్పించలేక అధికార యంత్రాంగం సతమతమవుతోంది.

నిర్వహణ లోపంతో : ఈ ఏడాది కురుస్తున్న అధిక వర్షాలతో రహదారులు ఘోరంగా దెబ్బతిన్నాయి. వాన నీటి ప్రవాహ తాకిడికి రోడ్డు అంచులు కోతకు గురికావడం, మెతకిచ్చి గుంతలు ఏర్పడ్డాయి. ఇరువైపులా పిచ్చి కంపచెట్లు అల్లుకున్నాయి. కల్వర్టులు, వంతెనల వద్ద రక్షణ గోడలు పడిపోయాయి. దీంతో ప్రమాదాలు ఘనణీయంగా పెరిగి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏటా మార్చి- ఏప్రిల్ నెలలో రహదారుల నిర్వహణకు అంచనాలు రూపొందిస్తారు. ప్రభుత్వం వీటిని ఆమోదించి నిధులు మంజూరు చేయడం సాధారణ ప్రక్రియ. జూన్- జులై నెలల్లో పిచ్చి కంపచెట్లు తొలగించడం, ప్రమాద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, రక్షణ గోడలు, మైలు రాళ్లకు రంగులు వేయడం తదితర పనులు చేపడతారు. వర్షాల సీజన్ ముగియగానే అక్టోబరు నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో గుంతలకు మరమ్మతులు చేస్తారు.


కోమటినేనివారిపాలెం- గోవిందాపురం రహదారి పైకి చేరిన కంప చెట్లు

వైకాపా ప్రభుత్వ తీరుతో ప్రజలకు అగచాట్లు

అయితే గడిచిన మూడేళ్లుగా ఈ ప్రక్రియను వైకాపా ప్రభుత్వం విస్మరించింది. నిధులు ఇతర శాఖలకు మళ్లించి రహదారి భద్రతను గాలికి వదిలేసింది. ఈ కారణంగా అధ్వాన మార్గాల్లో ప్రయాణించేందుకు ప్రజలు అగచాట్లు పడుతున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలోని రహదారులకు మరమ్మతులు చేయాలని ర.భ. శాఖ అధికారులపై ఒత్తిడి పెంచారు. నిధులు లేక గుత్తేదారులు ముందుకు రాక వాళ్లు సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వంతో చర్చించి ఎమ్మెల్యేలు నిధులు మంజూరుకు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. రహదారుల నిర్వహణకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తామని ర.భ. శాఖ జిల్లా ఇంజినీరు అధికారి రాజా నాయక్ తెలిపారు.

ధ్వంసమైన రహదారులే జగన్ పాలనకు నిదర్శనం

నాదెండ్ల, న్యూస్‌టుడే: ప్రజలు పాతాళానికి తొక్కేసినా ఇంకా తనదే ఉద్ధరింపు నట్టు మాజీ సీఎం జగన్ ప్రగల్భాలు పలుకుతున్నారని, రాష్ట్రంలో ధ్వంసమైన రోడ్లే ఆయన అధ్వాన పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు కేంద్రీయ విద్యాలయం నుంచి కనపర్రు రూ.40 లక్షలతో నిర్మించనున్న రహదారికి శుక్రవారం ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. తాము అధికారంలోకి వచ్చిన తొలి నాలుగు నెలల్లోనే పల్లెలో భారీగా ప్రగతి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తల తోటి రాణి, నాయకులు కరిముల్లా, బండారుపల్లి సత్యనారాయణ, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, కొండ్రగుంట సురేష్, సింగయ్య, రామయ్య, జయప్రకాష్, ఆలూరి రమణయ్య, రామారావు, మస్తాన్ వలి పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే: పట్టణంలో శుక్రవారం తమను ఇంటి నుంచి వెళ్లిపొమ్మన్నారని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. నరసరావుపేట కంభంపాటిలో చెందిన కొమ్ము సౌజన్య (24), ఆమె భర్త యేసుబాబు పాలిక్లీన్ పనులు చేసుకుంటారు. సౌజన్య భర్త యేసుబాబు, అత్త యేలసమ్మ, మరిది బాలరాజు ఒకే ఇంటిలో కలిసే ఉంటారు. ఈ నేపథ్యంలో కుటుంబ కలహాలతో శుక్రవారం ఉదయం అత్త, మరిది ఇంటి నుంచి బయటకు వెళ్లిపోండని సౌజన్య దంపతులను అన్నారు. దీంతో సౌజన్య మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్ చరణ్ తెలిపారు.

ఆసుపత్రి సమస్యలపై వివరణ కోరిన ఉన్నతాధికారులు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట వంద పడకల ఆసుపత్రిలో సమస్యలపై 'హతవిధీ.. ఆసుపత్రి' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీకుమారిని సమస్యలపై వివరణ కోరారు. దీంతో ఆమె ఆసుపత్రికి సంబంధించి రూ.9.3 కోట్లు మంజూరు అయ్యాయని, నిధులు రాగానే నూతన జనరేటర్ కొంటామని, ప్రహరీ నిర్మాణం, కాన్పుల విభాగం పక్కన బ్లాక్ అయిన మురుగునీటి కాలువ బాగు చేయిస్తామని ఉన్నతాధికారులకు తెలిపారు.

ప్రమాదవశాత్తూ వెల్డింగ్ కార్మికుడి మృతి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బస్టాండ్ సమీపంలో శుక్రవారం వెల్డింగ్ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బస్టాండ్ సమీపంలోని పొండ్రిలో షేక్ జానీ బాషా (43) వెల్డింగ్ పని చేస్తుండగా గ్యాస్ లీకై.. మంటలు వ్యాపించి అతని కాళ్లు, చేతులు కాలిపోయాయి. వెంటనే స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం జీజీహెచ్‌లో తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

వినుకొండ, న్యూస్‌టుడే : పట్టభద్రుల నియోజకవర్గ ఓటర నమోదుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసినందున సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు కోరారు. ఆ సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన కేంద్రాన్ని ప్రారంభిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్, ఓటరు కార్డు, డిగ్రీ పట్టా, ఫొటో వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు రవిబాబు, అజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు జిలాని సీనియర్ నాయకుడు లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు

నేడు భారీ అన్నదాన కార్యక్రమం

శావల్యాపురం : విజయదశమి సందర్భంగా శనివారం శావల్యాపురం శ్రీనిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మద్దినేని హరిబాబు తెలిపారు. పండగ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఉదయం 7.30కు హోమం, సాయంత్రం బాలికల ఆధ్వర్యంలో కోలాటం, డప్పు వాయిద్యాలు, మేళాతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారని చెప్పారు.